అనవుడు - నావుడు

మా గ్రామం పొలిమేరనుఉన్న లంజదిబ్బల్లో ఒక దానిని త్రవ్వించడానికి పురాతత్త్వశాఖవారు, మొన్న మొన్ననే పూనుకున్నారు.

ఆ ప్రదేశంలో ఉన్నది ఒక్కటే దిబ్బ కాదు సుమండీ! చెల్లాచెదురుగా, వెరసి చిన్నా పెద్దా కలిపి మూడు! చీకటి పడిన తరువాత సాధారణంగా, ఆ చాయలకు ఆసాములెవరూ పోరు. దయ్యాలూ, భూతాలూ ఉంటాయని కాదు! ఆ చుట్టుపక్కల అంతటా వల్లమాలిన గచ్చపొదలు? రాత్రి, ఓ జాము పొద్దువేళనుంచీ, తొలికోడి కూసేదాకా, – "గల–గలా: చెంగ్–చెంగ్" మంటో సన్న సన్నగా గాలి వాటున సవ్వడి వినబడుతూ ఉంటుంది!

ఆ మూడుదిబ్బలూ ముగ్గురు అక్కా చెల్లెళ్ళట. అందులో పెద్దది అప్పగారు – తతిమ్మావి చెల్లెళ్ళు: వాళ్ళు, కొల్లేరు పేద్ద సరస్సుగా శాపంతో మారక మునుపు అక్కడ రాజ్యంచేసిన రాజుగారి కూతుళ్ళట.

ఆ ముగ్గురు కన్నెలకూ యుక్తవయసు రాగానే రాజుగారు దేశదేశాలా స్వయంవరం చాటించారట! ఆకాశమంత పందిరీ, భూమంత వేదికా వేయించి, మూడు పెళ్ళిళ్ళకూ ఒకే మూహూర్తం పెట్టించి, కోలాహలంగా, సప్తసన్నాహాలూ చేశారట! ఏలేవారి ముగుదల శిరసా వహించి ఆ సీమలో ప్రజలందరూ, అబాలగోపాలమూ ఎవరింటో పొయ్యి వారు త్రవ్వేసుకుని, పట్టు తాపితాలు చేత బట్టుకుని, – అన్ని వర్ణాల వారూ దేవతార్చనకు, రాజుగారి దేవిడీకి తరలివచ్చారట: ఇక లెక్కకు నాలుగు రోజులుంది స్వయంవరం: అది, కాగానే వారం తిరిగివచ్చేసరికి సుముహూర్తం!

ఇది, ఇలా ఉండగా, ఆయేడు అదేం మాయోకాని, వర్షాలు, ఒక్క మాసం ముందుగానే ముంచుకొచ్చాయట! రథాలెక్క, ఏనుగులెక్క సిబ్బందితో సింగారంగా పెళ్ళి నడకలతో తరలివస్తున్న ఛప్పన్న దేశాల రాకొమరులూ, రాజ్యానికి రెండు మజిలీలు ఆకడనే ఆగిపోవలసి వచ్చిందట.

గంగ మడుగులు, కాలువలైనాయి – కాలువలు నదులైనాయి – నదులు ఏకసముద్రం కాగా, – ఎక్కడి వారక్కడే హరినామస్మరణ చేసుకుంటూ ఆగిపోవలసిన తిప్పలు వచ్చినాయి! కాకిచేత కబురంపుదామనుకున్నా – ఎటుచూసినా అంతనా నిరామయంగా ఉంది. ఎక్కడా, ఏ దిక్కునా పిట్ట ఆడటంలేదు:

దిగబడిన రథాలు దిగబడినట్టే ఉన్నాయి. ఏనుగులూ, గుర్రాలు, తక్కుంగల చిల్లరమల్లర జంతువులూ, సేనా సమూహము, ఒక్క ముక్కలో చెప్పాలంటే రథగజ తురగ పదాతి సమూహము ఒక్కుమ్మడిగా, రొంపపట్టి దిక్కులు మార్మోగేట్టు తుమ్ముతూ పడుందట.

ఈ పరిస్థితులన్నీ తాము స్వయంగా కొంతమేరకు చిత్తగించీ; మహామంత్రులు మనవిచేయగా ఆలకించీ - బయలుదేరి వచ్చిన పెళ్ళికొడుకు లందరికీ - ఒక్కసారి దిగ్భ్రమ చెందటంతో మతిపోయిందట: అందరి మట్టుకూ ఎవరికి వారే హతాశులై, జాతకం ప్రకారం తమకు యీ సంవత్సరం కళ్యాణయోగం లేదేమో అని అనుకునేంత స్థితికి వచ్చారట.

ఇక్కడ, మాటకు అడ్డంవచ్చి, ఒక్క ముక్క మనవి చేస్తేనేకాని, స్వారస్యం ఉండదు. అందరికీ రొంప పట్టిందనుకున్నామే అది కొంచెం అతిశయోక్తి! తరలి వచ్చిన మందీ మార్బలంలో కొందరు ముడేళ్ళుండక తప్పదు కదా! ఎల్లకాలం ఎండలో ఎండి, వానకు తడిసేవాళ్ళకు - యీ రుతువుమార్పు చీమ కుట్టినట్లు లేదు: ఆ గుంపు గుంపూ ఒక్కతుమ్ము తుమ్మిన పాపాన పోలేదు.

వాళ్ళందరూ, ఏరథంచాటున తలదాచుకుని, ఏం గూడుపుఠానీ చేశారో కాని, ఒకనాడు, సాయం సమయమున వాళ్ళలోకి కులవృద్ధు, వ్యాసులవారిలాటి ముడేలు, మహారాజ బిడ్డ లందరికీ నమస్కారంచేసి, యిలా మనవి చేశాడట.

"ఏలిన వారందరూ, యీ చాకలివాడి మనవి కాదనకుండా, చిత్తగించాలి! మహాప్రభువులందరూ యిక్కడ చిక్కుపడ్డారు! తమ జాడ తెలియక పెళ్ళికొమార్తెల కన్న ప్రభువుల వారు అక్కడ చికాకుపడుతూ ఉంటారు.

అయ్యేల సెలవైతే, నా చేతి క్రింద పడుచువాళ్ళను ముగ్గిరిని, ఆగమేగాలమీద తమరు చేరువకు వచ్చారని - కబురు చెప్ప నగరానికి తరుముతాను. ఒక్క కబురుకు ముగ్గురెందుకంటిరా -

దారిపొడుగునా, అగడ్తాలూ, అగాధాలు గంద! ఒక్కడైతే మునుగునో, తేలునో - మనిషికి మనిషి ఆసరా ఉంటే - తప్పినా జారినా అడుగుతీసి అడుగు వేయవచ్చు-

ఇద్దరైతే చాలదా అంటారేమో ప్రభువులు! ఒకడు ఊబిలో దిగితే, వాడికి చేయందిచ్చి రెండోవాడూదిగబడితే పిలిస్తే పలికేందుకన్నా - అట్లైందని, మనకు వేగు తెచ్చేందుకన్నా మరోడుండాలి గందా! - అందుకని - ముగ్గురుండాలని మనువు లిచ్చుకున్నా" నన్నాడు! "సరే" నన్నాడు - పెళ్ళి కుమారులందరూ!

అందరూ అంటే ఎందరో అనుకునేరు - యింతకు ముందా మాటచెప్పడం మరచిపోయినా, వచ్చింది, ముచ్చటగా ముగ్గురు మరైతే ఛప్పన దేశాలవారు తరలి వస్తున్నారంటివి గందా - అంటారా? - అవునయ్యా - వస్తున్నారు - వెనకాతలే వస్తున్నారు - కొందరు వెనక మజిలీలో - మరికొంద రా వెనక మజిలీలో - ఉన్నారు! నెమ్మదిమీద వస్తారు!

ఆఁ మళ్ళీ దోవకు వద్దాం - ఎక్కడున్నాం - పెళ్ళి కొడుకులు సరే నన్నారు కాదూ - అంటే ముడేలూ సరే నన్నాడు: ముగ్గురు చిన్న వాళ్ళనూ ముందుకు రప్పించాడు. చేరవలసిన కబురేదో ముమ్మారు చెప్పించాడు! ప్రాణాలకు తెగించైనా పట్నం చేరుకుంటామని, వాళ్ళచేత దొరల పాదాల దగ్గిర ప్రమాణం చేయించాడు.

చేయించాడు సరేనయ్యా! వాళ్ళు కాళ్ళు కదపందే! "ఆనవాలిచ్చి పంపండయ్యా"

అని మరోతూరి మనవి చేసుకున్నాడు మడేలు. ఏం ఆనవాలురా? - అన్నారు. అయ్యలు ముగ్గురూ - "అవే - అవే - పట్టిన కత్తీ పెట్టిన పాగా - వేసుకున్నదిరేసూ - యిచ్చి పంపండయ్యా - వట్టి చేతుల్తో - నోటి మాటల్తో వెలితే - చాకలోళ్ళ మాటలు మారాజులు నమ్ముతారా - అయ్యకు చూపేందుకు ఆ హంగులూ; ముద్దురాలికి చూపేందుకు ముద్రికలూ -" యిప్పించమన్నాడు మడేలు: యిచ్చి పంపారు దొరలు:

ఇక చూసుకోండయ్యా, ముగ్గురూ కొరమీనుల్లా వాగుల కడ్డంబడి - లోతనక రొంపనక ఒక్క లగువున రెండు ప్రొద్దులువాలే సరికల్లా - నగరం - పొలిమేరల్లోకి జేరుకున్నారు:

అక్కడ ఓ క్షణం ఆగిపోయినారు. మడేలు చెప్పిన ఆలోచన మనసులో నెమరేసుకున్నారు. తడిబట్టలు విడిచారు: అయ్యలిచ్చిన దిరేసు కట్టుకుని, - డాలూ, వాలూ పట్టుకుని - రొమ్ము విరుచుకుని - కోట గుమ్మంలో కాలుపెట్టారు.

కాలు పెట్టీ పెట్టంగనే కోటలో నగారాలు మ్రోగినాయి. వెయ్యి దీపాలు ఒక్క మెయిని వెలిగినాయి: తడి తడిగా ఉన్న భూమ్మీద అడుగుదీసి అడుగు వేసుకుంటూ రాజుగారు - అరతి పట్టించి, అడంగుల చేత దిష్టి తీయించారు.

అక్కడా యిక్కడా కాదని, అబ్బయ్యలు ముగ్గురునీ వెంటతోడుకుని - తానుండే కోటలోకి తీసుకువెళ్ళాడు: మూడుపొద్దులకు, మడేలుబిడ్డలు ముగ్గురూ కడుపునిండా బువ్వదిని కంటినిండా నిద్రపోయినారు:

భళ్ళున తెల్లవారింది. ఫెళ్ళున ఎండవచ్చింది. ఆ పొద్దే స్వయంవరము. కాని, మరో దొరకొడుకు ఆ చేరువకు రాందే --

పోనీ అదీ ఒకందుకు మంచిదే అనుకున్నారు. మహారాజువారు - కుమార్తెలు ముగ్గురితోనూ సంప్రదించాడు: పిల్లలు ముగ్గురూ మారుమాట చెప్పకుండా, చిలకలల్లే ఒకరినిచూసి ఒకరు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తండ్రి వంక చూసీ చూడనట్టూ ఓరకంటచూసి తలవంచుకున్నారు.

పరమానంద భరితులౌతూ, మహారాజుగారు, అమ్మాయిల చెలికత్తెలను పిలిపించుకుని, అసలు వైనమేమిటి - చిరంజీవుల మనస్సులో ఉన్న అభిప్రాయం ఏమిటీ - అని వాకబు చేయగా, తేలిందేమయ్యా అంటే -

అబ్బాయిలు ముగ్గురూ గాఢనిద్రలో ఉండగా, అమ్మాయిగార్లు తెలికత్తెలను చాటుచేసుకుని, ఆ చిన్న ఆవళ్ళు శయనించిన మందిరంలోకి అల్లంతదూరాన్నుంచి తొంగి చూశారట! వారి కిరీటాలూ - కత్తులూ - చూసి మొగం చూడక్కర్లేకుండానే తక్షణం వరించారట - వరించినప్పటినుంచీ - ఒక్కటే తాపంట, ఒక్కటే విరహంట.

అయితే, ఇక స్వయంవరంతో అవసరం ఏముందనుకున్నారు మహారాజుగారు. అయినప్పటికీ మహామంత్రులవారి సలహా నంగీకరించి - కొంత తడవు నిదానించి చూశారు. అనుకున్న వేళకు అతిథి, అభ్యాగతులు మరెవ్వరూ రాకపోయేసరికి, ఆ ముగ్గురికి యీ ముగ్గురూ "శుభం" అనుకున్నారు.

ఈ శుభవర్తమానం - పెళ్ళికొడుకులకు చెప్పేందుకు - మహామంత్రిగారికి ఆజ్ఞాపించారు.

మంత్రిగారు వచ్చేసరికి మందిరంలో ఏం జరుగుతుందయ్యా అంటే - ఎవడికి వాడు నిద్రలేచి, అలవాటు ప్రకారం ఎవడిపనులు వాడు చేసుకుపోతున్నాడు. ఒకడు చీపురట్టుకు ఊడుస్తున్నాడు, ఒకడు దుమ్ముదులుపుతున్నాడు, మూడోవాడు చాపలు చుట్టుతున్నాడు.

మంత్రిగారు, ఒక్క చూపులోనే - వీళ్ళ కులం, వీళ్ళ గుణం తెలుసుకున్నారు: తలుపులు బిగించి - కత్తి చేతబట్టారు కాని - ఒకడికి ముగ్గురుండిరేమో ఒక్కడూ వణకలా? - "ఓ రయ్యా నీ ధాంధూములు మాకాడ కావు - మాట యింటివా సిరసుంటది - రాజ్యంలో సగం సేతుంటది-" అన్నారయ్యా! ఆ మంత్రి ఎంత పాపకర్ముడో కాని - ఆ సీమపుట్టి ఆ సీమ పెరిగి - ఆ కొలువు కొలిచి అంత పాపానికి ఒడిగట్టినాడయ్యా!

సరేనన్నాడు. చేతిలో చేయి వేయించుకున్నారు: పిల్లవాళ్ళు ముగ్గురికీ పెళ్ళయేదాకా మౌనవ్రతం అన్నాడు: ఎవరూ పలుకరించరా దన్నాడు: అన్నిటికీ రాజుగారు సరే నన్నాడు:

మళ్ళీ తెల్లవారింది: ఇక మరోగడియకు ముహూర్తం: పెళ్ళి కొమాళ్ళు ముగ్గురూ వెళ్ళి కొల్లేరమ్మను కొలిచి వచ్చి బాసికం కట్టాలి. బయలుదేరారయ్యా పెళ్ళికొడుకులు!

వీ రటు బయలుదేరడం చూసి అక్కా చెల్లెళ్ళు ముగ్గురూ గచ్చకాయలు ముందోసుకు కూచున్నారు. - గౌరి దేవి పాట పాడుకుంటూ: పాటయేసరికి ఆట కావాలి: ఆటయేసరికి - మంగళస్నానం - ఆ హైతేనే ఆడకూతురికి ఐదవతనం - వేయికాలాలపాటు నిలుస్తుందని - ఏనాటి నుంచో వస్తున్న నమ్మకమాయెను--

అక్కడ - ఆ శివశక్తిని చూడగానే - ముగ్గురు పెళ్ళి కొడుకులకూ కాళ్ళు వడికినాయి. అడుగు వెనక్కి వేశారు. కాని వెనుక నిలుచున్న మంత్రి, ఓ అడుగు ముందుకు త్రోశాడు: "అది గొర్రెల్నీ మేకల్నీ తినేదిరా - మీ జోలికి రాదని", వెన్ను చరిచాడు: వాళ్ళు వెన్ను విరిచారు: అక్కడే మంత్రికి అర్థరాజ్యం ధారాదత్తం చేశారు - మీసం మీద చేయి వేశారు.

ఇక చూచుకో అయ్యా! - ఆ తల్లికి ఉగ్రంవచ్చిందో వాళ్ళ పాపం పండిందో కాని -ఆకాశం చిల్లులుపడ్డాయి - సముద్రాలకి కట్టలు తెగినాయి - ఏక వెల్లువైంది - దేశం నేలగలసిపోయింది.

ఆ పొంగులోపడి ఆ ముగ్గురు పెళ్ళికూతుళ్ళూ కొట్టుకొచ్చి - యిక్కడ దిబ్బేసుపోయినారు. ఆ మంత్రి గచ్చ పొద అయిపోయాడు: వెళ్ళిన వాళ్ళకోసం - వాళ్ళు అలాగే గచ్చకాయలాడుతూ కూచున్నారటయ్యా!-

వాన వెలిసి వంగుడు వెలిసిన తరువాత, తరలివచ్చిన రాజు రాలేదా - అంటారా - రాకేం వచ్చారు! వచ్చి చూస్తే, ఏముంది - ఊరున్న చోట ఏరుంది: ఎక్కడికి వచ్చి వెల తెలా పోయినారు - అందరూ అని కొంగలైపోయి - ఆ యేటిమీదే తిరుగు తుంటారయ్యా!

మరి, యింత ఘాతకం తలపెట్టిన ఆ పెళ్ళికొడుకుల గతేమి టంటారా - పెద్దలు చెప్పలా:

తాజాకలం: - దిబ్బ తవ్వించడానికి వచ్చిన ద్రవిడ అధికారితో తాతయ్య యీ కథ అప్పటి కప్పటికి కల్పించి - (యిందుకు తాతయ్య హామీ) చెప్పగా -

పెళ్ళీడు పిల్లలున్న అగ్రహస్థు, అయ్యోపాపం అని ముక్కు మీద వేలేసుకుని - ఏతత్ దిబ్బలో, ప్రాచీన సామాగ్రి దొరకదనీ, అది కేవలం అధునాతనమైన పాటిమట్టిదిబ్బ మాత్రమేననీ, ప్రక్కచేలోంచి పాటిమన్ను శాంపుల్సుతో కలిపి - కేంద్ర ప్రభుత్వంవారికి ఒక బృహత్ నివేదిక పంపుకుని - తాతగారింట ముప్పొద్దులు విందు కుడిచి, మరో దిబ్బను వెదుక్కుంటూ వెడలిపోయినాడు.

తాతయ్యలో ప్రగతి శీలత లేదంటారా మీరు: అనండి - ఆయన ఒక్కడిలోనేకాదు - మా ఏ ఒక్కడిలోనూ లేదు: దిబ్బలు, ఆ పొదలూ, ఆ రొదలూ, లేకపోతే, మాకు, మాసీమకు వేడు కేముంది - ముచ్చటేముంది!

వెయ్యి అబద్ధాలాడి ఒక యిల్లు నిలపమన్నారు పెద్దలు - ఒక్క అబద్ధం ఆడి, మూడు దిబ్బలు కలకాలం నిలిపాడు తాతయ్య స్వస్తిరస్తు.

★ ★ ★